క్లుప్తంగా

నేటి నుంచి ఆలయ వార్షికోత్సవాలు

నందిగామ టౌన్‌: పట్టణంలోని చెరువు బజార్‌లో వేంచేసియున్న షిర్డీ సాయిబాబా మందిర 23వ వార్షిక బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. మహోత్సవాల సందర్భంగా ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఈసందర్భంగా ఆలయ అర్చకుడు దెందులూరి కృష్ణశాస్త్రి, ఆలయ ధర్మకర్త అమ్మవరపు మల్లికార్జునరావు మాట్లాడుతూ శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహోత్సవాలలో భాగంగా శుక్రవారం గణపతి పూజ, అఖండ ప్రతిష్టాపన, మండపారాధన, సాయినాధునికి పంచామృతాభిషేకాలు, చండీ, రుద్ర హోమాది క్రతువులు, సహస్త్ర దీపోత్సవం, శనివారం సుగంధ ద్రవ్యాలతో మహన్యాసపూర్వక ఏకాదశ కలశాభిషేక పూజలు, లక్ష మల్లెలార్చన, ఆదివారం స్వామివారికి అన్నాభిషేకం, కనకాభిషేకం, సహస్త్ర పుష్పాభిషేకం, ప్రత్యేక అలంకరణలు, మహా పూర్ణాహుతి, అనంతరం శివపార్వతుల దివ్య శాంతి కల్యాణం, అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని వార్షికోత్సవ మహోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

బ్యాగులు అందజేత



కంచికచర్ల : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు గురువారం పంపిణీ చేశారు. విద్యార్థులందరికీ యూనిఫాం, షూ, టై అందజేశారు. నాలుగు, ఏడో తరగతి విద్యార్థులకు మినహా అన్నితరగతుల విద్యార్థులకు పుస్తకాలు, నోట్‌పుస్తకాలు పంపిణీ చేశారు. నాలుగు, ఏడు తరగతులకు సంబంధించిన పుస్తకాలు ఇంకా ప్రభుత్వం నుంచి పాఠశాలలకు చేరలేదు. రెండుమూడురోజుల్లో ఈ రెండు తరగతులకు సంబంధించిన పుస్తకాలు కూడా వస్తాయని ఎంఈవో బాలాజీ తెలిపారు. విద్యార్థులకు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం సరఫరా చేసిన బ్యాగులను ఎంఈవో, హెచ్‌ఎంలకు అందజేశారు.

పాఠశాలలకు పుస్తకాలు..

వీరులపాడు: మండలంలోని అన్ని గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేస్తున్నట్లు ఎంఈవో పాలెకెనడి తెలిపారు. స్థానిక ఎంఈవో కార్యాలయంలో గురువారం ఆయన మండలంలోని ఆయా పాఠశాలలకు సంబంధించిన పాఠ్యపుస్తకాలను ప్రధానోపాధ్యాయులకు అందజేశారు. ఎంఈవో పాలెకెనడీ మాట్లాడుతూ ఉపాధ్యాయులంతా సమయ పాలన పాటించాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

దాసాంజనేయ ఆలయ హుండీ ఆదాయం రూ. 6.23 లక్షలు



మధురానగర్‌(విజయవాడసెంట్రల్‌): నగరంలోని మాచవరంలో ఉన్న ప్రసిద్ధ దాసాంజనేయస్వామివారి దేవాలయంలో భక్తులు హుండీలలో సమర్పించిన కానుకల ద్వారా రూ. 6లక్షల 23వేల 631, మరో 4 అమెరికా డాలర్లు ఆదాయం లభించింది. దాసాంజనేయస్వామివారి దేవాలయంలో గురువారం దేవదాయ శాఖ తనిఖీ అధికారి కేవీ అనురాధ పర్యవేక్షణలో సేవాసంఘం సభ్యులు, ఆలయ కార్యనిర్వాహణ అధికారి నాగినేని భవాని సమక్షంలో హుండీ కానుకల లెక్కింపు జరిగింది. 70 రోజులకు గానూ భక్తులు హుండీలలో సమర్పించిన కానుకల ద్వారా ఈ ఆదాయం లభించినట్లు భవాని తెలిపారు. కానుకల లెక్కింపులో ఆలయ అర్చకులు, సేవాసంఘం సభ్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

16 నుంచి ఉచిత యోగా శిక్షణ శిబిరం

కృష్ణలంక(విజయవాడతూర్పు): ఈ నెల 16వ తేదీ నుంచి కృష్ణలంక శాఖ శ్రీ వెంకటేశ్వర యోగా సేవా కేంద్రం ఆధ్వర్యంలో 920వ నూతన ఉచిత యోగా శిక్షణ శిబిరం ప్రారంభిస్తున్నట్లు అగ్నిమిత్ర యోగి గురూజీ పోకూరి గోవర్ధనరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కృష్ణలంక, గౌతమీనగర్ 3వ లైన్‌లోని శ్రీరాజ్యలక్ష్మి నిలయంలో ఆదివారం ఉదయం 6.30 గంటలకు శిక్షణ శిబిరం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ప్రతి రోజు ఉదయం 5 నుంచి 7 గంటల పాటు యోగా శిక్షణ తరగతులు జరుగుతాయని చెప్పారు. 8 నుంచి 80 సంవత్సరాల వయస్సు గల స్త్రీలు, పురుషులు కుల, మత భేదం లేకుండా శారీరక, మానసిక ఆరోగ్యం కోరుకునే వారందరూ శిక్షణలో పాల్గొనవచ్చని తెలిపారు. ఆసక్తి కలవారు 98851 68864, 98481 53417, 63048 10297 నంబర్లలో సంప్రదించి తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు.

ఆదమరిస్తే..అంతే సంగతులు

- ప్రమాదకరంగా వంతెనలు
- రెయిలింగ్ లేకపోవడంతో ఇబ్బందులు
- ఆందోళనలో వాహనచోదకులు



ప్రమాదకరంగా ఉన్న మునేరు కాజ్‌వే

పెనుగంచిప్రోలు: మండలంలో పెనుగంచిప్రోలు మునేరుపై కాజ్‌వే, అనిగండ్లపాడు గ్రామ సమీపంలోని వాగుపై నిర్మించిన వంతెనలు ప్రమాదభరితంగా మారాయి. వాహనదారులు ఏమాత్రం ఆదమరచినా ప్రమాదానికి గురికావడం ఖాయం. ఈ వంతెనలకు రక్షణగోడ(రెయిలింగ్) లేకపోవడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. పెనుగంచిప్రోలు మునేరుపై సుమారు కిలోమీటరు మేర నిర్మించిన కాజ్‌వేకు రెండు వైపులా రెయిలింగ్ సదుపాయం లేకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రమాదవశాత్తు కాజ్‌వే పై నుంచి మునేరులోకి ద్విచక్రవాహనాలు, ఆటోలు, వ్యాన్‌లు పడిపోతున్నాయి. ఈమార్గంలో నిత్యం కళాశాలలు, స్కూల్‌బస్సులు, ఆటోల్లో విద్యార్థులు, ప్రజలు ప్రయాణం సాగిస్తుంటారు. ముఖ్యంగా వర్షాకాలంలో వరదలు వచ్చినప్పుడు మునేరుకు ఉధృతంగా వరదనీరు వచ్చి చేరుతుండటంతో ఈ మార్గంలో రాకపోకలంటేనే జనం ఆందళన చెందుతున్నారు.

శిథిలావస్థలో వంతెన..

అనిగండ్లపాడు సమీపంలోని దూళ్లవాగుపై వంతెనకు రెండు వైపులా రెయిలింగ్ ఊడిపోయి ఉంది. వంతెన కూడా శిథిలావస్థకు చేరింది. వంతెన మలుపులో ఉండటంతో మరింత ప్రమాదకరంగా మారింది. ఇక్కడ ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా వాహనాలు వంతెనపై నుంచి వాగులో పడిపోతున్నాయి. ఆంధ్రా, తెలంగాణ ప్రజలు నిత్యం ఈవంతెనపై నుంచి రాకపోకలు సాగిస్తుంటారు. గతంలో మునేరు కాజ్‌వేపై నుంచి వాహనాలు పడిపోవటంతో తీవ్రంగా గాయపడటంతోపాటు పలువురు మృతిచెందిన ఘటనలు కూడా ఉన్నాయి. వాహన చోదకులు, ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అధికారులు వెంటనే స్పందించి తగు చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



మునేరులో పడిన ట్రాక్టర్(ఫైల్)



రెయిలింగ్ ఊడిపోయి ఉన్న అనిగండ్లపాడు వంతెన

అధికారులు తక్షణమే చర్యలు చేపట్టాలి..



తరచూ కాజ్‌వే పై నుంచి వాహనాలు పడిపోతుండటంతో పలువురు మృత్యువాత పడ్డారు. అనిగండ్లపాడు సమీపంలోని వాగుపై వంతెన రెండు వైపులా రెయిలింగ్ ఊడిపోయి ప్రమాదకరంగా ఉంది. వర్షాకాలంలో వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో మాకు ఎంతో భయంగా ఉంటోంది. అధికారులు స్పందించి ప్రమాదాల నివారణకు తగిన చర్యలు చేపట్టాలి.

కోలా రామారావు, అనిగండ్లపాడు గ్రామస్తుడు

18న భూముల కౌలువేలం

నందిగామ టౌన్‌: మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న ఆలయాలకు చెందిన భూములకు టెండర్ కం బహిరంగ కౌలు నిర్వహిస్తున్నట్లు ఈవోలు ఫణికుమార్, గంగాధర్ గురువారం తెలిపారు. మండలంలోని పెద్దవరం నీలకంఠేశ్వర స్వామి వారి ఆలయానికి చెందిన 12.60ఎకరాలకు, చెన్నకేశవ స్వామి వారి ఆలయానికి చెందిన 14ఎకరాల భూమికి చెన్నకేశవ స్వామివారి ఆలయ ఆవరణలో ఈనెల 18వతేదీన ఉదయం 10 గంటలకు కౌలువేలం నిర్వహిస్తున్నట్లు వివరించారు. లింగాలపాడులో వేంచేసియున్న లక్ష్మీ పేరంటాళ్ల అమ్మవారి ఆలయ ఆవరణలో ఉదయం 11 గంటలకు తక్కెళ్లపాడు, లింగాలపాడు గ్రామాల సమీపంలోని ఆలయానికి చెందిన 37.24 ఎకరాల భూమికి కౌలువేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 19న ఉదయం 11 గంటలకు మాగల్లులోని మదన గోపాలస్వామి వారి ఆలయ ఆవరణలో ఆలయానికి చెందిన 29.64 ఎకరాలకు కౌలువేలం నిర్వహిస్తున్నామన్నారు. ఆసక్తిగల రైతులు ఈ కౌలువేలంలో పాల్గొనాలని ఈవోలు కోరారు.

వాహనాల వేలం

జగ్గయ్యపేట అర్బన్‌: మద్యం కేసుల్లో పట్టుబడిన వాహనాలకు ఈనెల 18వ తేదీ ఉదయం పదిగంటలకు వేలం నిర్వహిస్తున్నట్లు జగ్గయ్యపేట ఎస్‌ఈబీ ఇన్‌స్పెక్టర్ ఎస్.మణికంఠరెడ్డి గురువారం తెలిపారు. తొర్రగుంటపాలెం 14వ వీధిలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఆఫీసు పక్కనున్న స్పెషల్ ఎండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ వద్ద ఈ వేలం నిర్వహిస్తామన్నారు. వేలంలో పాల్గొనేందుకు ఆసక్తిగలవారు ఆయా వివరాలకు ఎస్‌ఈబీ సీఐ సెల్ నెంబర్లు 9440902461, 9490874538లో సంప్రదించాలని సూచించారు.

మోగిన బడిగంటలు



జగ్గయ్యపేట మండలం వేదాద్రి ఎంపీపీ పాఠశాలకు ఉత్సాహంగా వస్తున్న విద్యార్థులు



చిల్లకల్లు జెడ్పీ పాఠశాలలో విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు

జగ్గయ్యపేట : పాఠశాలలు పునఃప్రారంభం కావడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు గురువారం బడిబాట పట్టారు. నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉదయం నుంచి పాఠశాలలకు వెళ్తుండటంతో పట్టణంలో ఉదయం వేళ కొంత హడావుడి కనిపించింది. 50 రోజులు వేసవి సెలవులు అనంతరం విద్యార్థులు ఆటపాటలకు స్వస్తి పలికి బడికి బయలుదేరివెళ్లారు. చాలారోజుల సెలవుల అనంతరం తిరిగి పాఠశాలకు వెళ్లేందుకు కొంతమంది చిన్నారులు మారం చేయగా, మరికొంతమంది తల్లిదండ్రులు తమ చిన్నారులను మంచిరోజు చూసి పాఠశాలకు పంపిస్తామని చెప్పారని ఆయా పాఠశాలలకు చెందిన పలువురు ఉపాధ్యాయులు తెలిపారు. జగ్గయ్యపేట మండలంలో 61 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా మొదటిరోజు విద్యార్థుల హాజరు అరకొరగానే ఉంది. కొన్ని పాఠశాలలో విద్యార్థులకు ఉపాధ్యాయులు స్వీట్లు పంచుతూ స్వాగతం పలికారు. పట్టణంలోని ప్రైవేటు పాఠశాలలను యాజమాన్యాలు ముస్తాబు చేసి విద్యార్థులకు పూలతో స్వాగతం పలికాయి.

జగ్గయ్యపేటలో గంటపాటు భారీ వర్షం

జగ్గయ్యపేట: పట్టణంలో గురువారం సాయంత్రం గంటపాటు భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ వేడిమితో అల్లాడుతున్న ప్రజలకు సాయంత్రం ఐదు గంటల సమయంలో కురిసిన వర్షానికి ప్రజలు సేదతీరారు. సాయంత్రం వేళ వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు రావడంతోపాటు ఉరుములు మెరుపులతో గంటపాటు భారీ వర్షం కురవడంతో విద్యుత్‌శాఖ అధికారులు విద్యుత్ సరఫరాను నిలిపివేశారు.



జగ్గయ్యపేటలో కురుస్తున్న వర్షం

కాలుష్యాన్ని తగ్గించేందుకు మొక్కలు పెంచండి

- బెంజి సర్కిల్ బ్యూటిఫికేషన్‌పై చర్యలు తీసుకోండి
- మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశం



అధికారులకు సూచనలు ఇస్తున్న విజయవాడ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

భవానీపురం(విజయవాడపశ్చిమ): నిత్యం రద్దీగా ఉండే బందరు రోడ్డు, బెంజి సర్కిల్ జంక్షన్ నుంచి రామవరప్పాడు వైపు వెళ్లే ఏలూరు రోడ్డుతో పాటు సర్వీస్ రోడ్డును నగర పాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ గురువారం నేషనల్ హైవే, మున్సిపల్ అధికారులతో కలిసి పరిశీలించారు. బెంజి సర్కిల్ బ్యూటిఫికేషన్‌పై అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలోని ప్రధానమైన జంక్షన్లలో బెంజి సర్కిల్ జంక్షన్ ఒకటైనందున కాలుష్యాన్ని తగ్గించే దిశగా గ్రీనరీని పెంచాలన్నారు. వర్షం కారణంగా రోడ్లు వర్షపు నీళ్లతో నిండి ప్రజలు ఇబ్బందులు పడకుండా సైడ్ డ్రెయిన్లలో సిల్ట్ తీయడమే కాకుండా డ్రెయిన్లలో మురుగునీటి ప్రవాహానికి ఎటువంటి అడ్డంకులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్) కె.సత్యవతి, డెప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) జి.సృజన, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు ఏఎస్ఎన్ ప్రసాద్, చంద్రశేఖర్, డెప్యూటీ సిటీ ప్లానర్ జూబిన్ చీరన్ రాయ్, నేషనల్ హైవే సైట్ ఇంజినీర్ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

యువతకు ప్రగతిపథ మార్గదర్శి భగవద్గీత

శ్రీవిద్యాపీఠాధిపతి బాల స్వామీజీ



భవానీపురం(విజయవాడపశ్చిమ): యువతను ప్రగతి పథంలోకి నడిపించే మార్గదర్శి శ్రీకృష్ణుడు అర్జునునికి ఉపదేశించిన భగవద్గీత అని శ్రీవిద్యా పీఠాధిపతి (తెనాలి) శ్రీప్రజ్ఞానంద సరస్వతి (బాల స్వామీజీ) అన్నారు. భవానీపురానికి చెందిన శ్రీగోవిందనామ ప్రచార సేవా సంఘం ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం గొల్లపూడి బైపాస్ రహదారిలో గల శ్రీరస్తు కల్యాణ మండపంలో నిర్వహించిన శ్రీభగవద్గీత ప్రగతిపథం కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులతో భగవద్గీత శ్లోక పఠనం పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసి విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం బాల స్వామీజీ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ప్రతి ఒక్కరికీ వ్యక్తిత్వ వికాసానికి, జీవన నడవడికకు ఒక దిక్సూచిలా భగవద్గీత ఎంతగానో దోహదపడుతుందని అన్నారు. సమాజంలో ఉన్నత స్థాయికి ఎదిగేందుకు విజయావకాశాలను చూపించే దర్శిని భగవద్గీత అని అన్నారు. దేవదాయ ధర్మదాయ శాఖ ధర్మప్రచార పరిషత్ కో ఆర్డినేటర్ డాక్టర్ వేదాంతం రాజగోపాల చక్రవర్తి మాట్లాడుతూ గోవిందనామ ప్రచారాన్ని ఒక సేవా కార్యక్రమంగా ఎంచుకున్న టి.సునీతా, మధుసూదన్ దంపతులు అభినందనీయులన్నారు. ముఖ్యంగా విద్యార్థులతో భగవద్గీతలోని శ్లోకాలను పఠింపచేస్తూ వారిలో ఆధ్యాత్మిక చింతన పెంపొందించడం శుభపరిణామమని తెలిపారు. ధనుర్మాసంలో రాష్ట్రంలోని శ్రీవారి ఆలయాలకు తులసి మాలలు అందిస్తున్న సునీతా మధుసూదన్ దంపతులకు శ్రీనివాసుని అనుగ్రహం లభిస్తుందని ఆయన పేర్కొన్నారు.

కేవీఆర్‌లో ఇంటర్ అడ్మిషన్లు ప్రారంభం

పెనుగంచిప్రోలు: స్థానిక కేవీఆర్ జెడ్పీ హైస్కూల్‌కు జూనియర్ కళాశాల మంజూరైందని హెచ్‌ఎం కె.జలజ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024–25కు సంబంధించి ఇంటర్మీడియట్ అడ్మిషన్లు జరుగుతున్నాయన్నారు. ఈఏడాది ఎంపీసీ, సీఈసీ కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని హెచ్‌ఎం కోరారు.

ఎమ్మెల్యేను కలిసిన దస్తావేజు లేఖరులు



జగ్గయ్యపేట అర్బన్‌: జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య)ను పలు గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ఉద్యోగులు గురువారం మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. అదేవిధంగా ఎమ్మెల్యే తాతయ్యను జగ్గయ్యపేట పట్టణ దస్తావేజు లేఖరులు కలిసి దుశ్శాలువతో ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యేను కలిసి అభినందనలు తెలియజేసినవారిలో దస్తావేజు లేఖరులు చామర్తి శ్రీనివాసరావు, తాతయ్య, గడివేముల రాము, నజీర్, చందు, కిరణ్, ఉమా, కిషోర్, అనంత్, నరేష్, మల్లేష్, వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు, ప్రవీణ్ ఉన్నారు.

20న ముద్ర లోన్ స్కీమ్‌పై వర్క్‌షాప్

మధురానగర్‌(విజయవాడసెంట్రల్‌): ఎంఎస్‌ఎంఈ చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యాన ఈనెల 20వ తేదీ గురువారం ముద్రలోన్ స్కీమ్‌పై వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు చాంబర్ ఆఫ్ కామర్స్ చైర్మన్ డాక్టర్ దాసరి దేవరాజ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వర్క్‌షాప్‌లో 5 లక్షల లోపు చిన్న తరహా వ్యాపార నమూనాలు, వ్యాపార అవకాశాలు, కొత్త వ్యాపార ఆలోచనలు, రుణ మార్గదర్శకత్వం, డాక్యుమెంటేషన్ సబ్సిడీ మద్దతుల గురించి తెలియ జేస్తారన్నారు. చిన్న వ్యాపారం కోసం మార్కెటింగ్ మద్దతుపై ఎక్కువ దృష్టి పెట్టటంతో పాటు వారికి అవసరమైన సహకారం అందజేస్తామని తెలిపారు. వర్క్‌షాప్ బీఆర్‌టీఎస్ రోడ్డు నోరి హాస్పిటల్ సమీపంలోని ఎంఎస్‌ఎంఈ చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో గురువారం ఉదయం 10 గంటలకు జరుగుతుందన్నారు. వర్క్‌షాప్‌లో పాల్గొన్న వారికి మెటీరియల్, ట్రైనింగ్ సర్టిఫికెట్ అందిస్తామని తెలిపారు. ఆసక్తి కలిగిన ఔత్సాహిక ముద్ర లోన్ వ్యాపారులు వర్క్‌షాప్‌లో పాల్గొనేందుకు ఎంఎస్‌ఎంఈ చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో స్వయంగా కానీ 8919737517, 6305941717 ఫోన్ నంబర్లలో కానీ తమ పేర్లు నమోదు చేయించుకోవాలని ఆయన సూచించారు. ఈ సదవకాశాన్ని చిన్న తరహా వ్యాపారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పేటలో తాగునీటి సరఫరాపై సమీక్ష



హెడ్‌వాటర్ వర్క్స్ వద్ద క్లోరినేషన్ కోసం కొత్త సిలిండర్‌ను ఏర్పాటు చేస్తున్న సిబ్బంది



వాటర్‌ట్యాంక్ పరిసరాలను పరిశీలిస్తున్న కమిషనర్ నాగమల్లేశ్వరరావు

జగ్గయ్యపేట అర్బన్‌: జగ్గయ్యపేట పట్టణంలో తాగునీటి సరఫరాలో తలెత్తిన సమస్యల పరిష్కారంపై మున్సిపల్ కమిషనర్ సీహెచ్.నాగమల్లేశ్వరరావు గురువారం తన కార్యాలయంలో ఇంజినీరింగ్ అధికారులు, మున్సిపల్ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. తాగునీటి సరఫరాకు సంబంధించి మెయిన్ పైపులైన్ లీకేజీలు, మోటార్ల సక్రమ నిర్వహణ, క్లోరినేషన్, ఇంటెక్ వెల్‌లో ప్యూరిఫికేషన్, ఈఎల్ఎస్ఆర్(ఎలిమినేటెడ్ సర్వీస్ రిజర్వాయర్) లీకేజీ తదితర అంశాలపై చర్చించారు. కమిషనర్ నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ చెరువుబజారులోని ఈఎస్ఎస్ఆర్ మరమ్మతులు చేయాలని, ఇన్‌టెక్ వెల్‌లో పూడిక తీసేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ ఉన్నతాధికారులకు లేఖరాసినట్లు వివరించారు. ఈఎల్ఎస్ఆర్ పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చూడాలని మున్సిపల్ సిబ్బందిని ఆదేశించారు. మున్సిపల్ డీఈ శివకోటేశ్వరరావు మాట్లాడుతూ పైపులైన్‌కు పెద్ద లీకేజీలు ఎక్కడా కనిపించలేదన్నారు. సాధారణంగా వచ్చే చిన్నచిన్న లీకేజీల సమస్యను పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. 20ఏళ్లుగా పట్టణంలో రోజుకు ఒక్కసారి మాత్రమే తాగునీటిని సరఫరా చేస్తున్నామన్నారు. ప్రజలు కూడా వారి ఇళ్లలోని మోటార్లను తొలగించి, పట్టణంలో సజావుగా అందరికీ నీరు అందేలా మున్సిపాలిటీకి సహకరించాలని కోరారు. సమావేశం అనంతరం కమిషనర్ నాగమల్లేశ్వరరావు స్థానిక ఆనందసాయి ఆలయం వద్దనున్న వాటర్‌ట్యాంకు పరిసరాలను పరిశీలించారు.

హిందూ భక్తుల భద్రతకు చర్యలు తీసుకోవాలి

కలెక్టర్‌కు వీహెచ్‌పీ నేతల వినతి



జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న వీహెచ్‌పీ నేతలు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్‌): జమ్ముకశ్మీర్‌లో హిందూ భక్తులపై జరిగిన ఉగ్రదాడిని ఖండిస్తూ హిందూ భక్తుల భద్రతకు చర్యలు తీసుకోవాలని కోరుతూ విశ్వహిందూ పరిషత్ మహానగర్ కార్యదర్శి క్రోవి రామకృష్ణ ఆధ్వర్యంలో నేతలు గురువారం జిల్లా కలెక్టర్ ఢిల్లీరావుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ విశ్వహిందూ పరిషత్ పిలుపు మేరకు దేశవ్యాప్తంగా అన్ని జిల్లాల కలెక్టర్‌లకు వినతిపత్రాలు అందజేస్తున్నామన్నారు. ఈ నెల 9న జమ్ము కశ్మీర్‌లోని వైష్ణోదేవి ఆలయం నుంచి శివ్‌ఖోడికి హిందూ భక్తులు ప్రయాణిస్తున్న బస్సుపై ఇస్లామిక్ జీహాదీ ఉగ్రమూకలు దాడి చేయడం బాధాకరమని అన్నారు. ఈ దాడిలో 10 మంది భక్తులు ప్రాణాలు కోల్పోగా 30 మందికి పైగా గాయాలపాలయ్యారని అన్నారు. దేశంలో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సిందిగా వినతిపత్రం ద్వారా కలెక్టర్‌ను కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ సహాయ కార్యదర్శి కొంపెల్లి శ్రీనివాస్, నేతలు సత్యనారాయణ, ఎ.శ్రీనివాస్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రారంభమైన సప్తమ వార్షిక బ్రహ్మోత్సవాలు



వేంకటేశ్వర స్వామివారికి నలుగు పెడుతున్న దృశ్యం



108 కలశాలు

మధురానగర్‌(విజయవాడసెంట్రల్‌): దావు బుచ్చయ్యకాలనీ శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి దేవాలయం సప్తమ వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభం అయ్యాయి. ఉదయం 8 గంటలకు ఆలయ అర్చకులు 108 కలశాలతో శుద్ధ జలాభిషేకం, తిరుమంజనం సేవ నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు అర్చనలు వేద పండితుల మంత్రోచ్ఛరణలతో జరిగాయి. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాలను ఆలయ ధర్మకర్త అంగలూరి పద్మావతి పర్యవేక్షించారు.

శ్రీదత్తసాయి మందిరంలో 500 మందికి అన్న ప్రసాద వితరణ



మధురానగర్‌(విజయవాడసెంట్రల్‌): పసుపుతోట శ్రీదత్తసాయి మందిరంలో గురువారం బాపట్ల న్యాయమూర్తి సతీమణి ఆధ్వర్యాన 500 మందికి అన్నప్రసాద వితరణ జరిగింది. మందిర వ్యవస్థాపకుడు తంగెళ్లమూడి వీర మోహనరావు బాబాకు ప్రత్యేక పూజలు అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. శ్రీసాయి నక్షత్రమాలిక మండలి ఆధ్వర్యాన బాబా పారాయణం జరిగింది. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు బాబాను దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు.